# బంగారం ధరలు ఇంకా తగ్గుతాయ్

• ఆర్‌ఎస్‌బిఎల్ ఎండి పృథ్వీరాజ్ కొఠారి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : రానున్న రోజుల్లో బంగారం ధరలు మరింత తగ్గే అవకాశాలున్నాయని రిద్దిసిద్ధి బులియన్స్ లిమిటెడ్ (ఆర్‌ఎస్‌బిఎల్) మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీరాజ్ కొఠారి అన్నారు. ప్రస్తుతం 29 వేల రూపాయల స్థాయిల్లో కదలాడుతున్న బంగారం కొద్ది నెలల్లో మరో 1,000-2,000 రూపాయల వరకు తగ్గవచ్చని ఆయన చెప్పారు. అయితే 25 వేల రూపాయల వరకు తగ్గే అవకాశం లేదని కొఠారి అన్నారు. శుక్రవారం నాడిక్కడ ఆయన ఆర్‌ఎస్‌బిఎల్ ఇ కాయిన్స్ ట్రేడింగ్‌ను ప్రారంభించారు. 2013లో వివాహాది శుభకార్యాలకు భారతీయులు అంతగా మక్కువ చూపకపోవటం వంటి అంశాలు బంగారం ధరలు తగ్గటానికి కారణాలుగా ఉన్నాయని, బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఇదే సరైన సమయమని, సంవత్సరాంతం నుంచి బంగారం ధరలు మళ్లీ దూసుకుపోవటం ఖాయమని అన్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగడం, డాలర్ విలువ బలపడటం వంటి అంశాలు బంగారం ధరలు పెరగటానికి కారణం కానున్నాయని కొఠారి చెప్పారు. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో ప్రస్తుతం 1,450-1,500 డాలర్ల స్థాయిల్లో కదలాడుతున్న ఔన్సు బంగారం ధరలు మరో రెండేళ్లలో మళ్లీ 2,000 డాలర్లకు చేరుకునే అవకాశాలు లేకపోలేదని అన్నారు.

## 65-70 వేలకు వెండి..

పారిశ్రామిక వినియోగం నానాటికి పెరిగిపోతుండటంతో వెండి ధరలు దూసుకుపోయే అవకాశం ఉందని కొఠారి చెప్పారు. రానున్న కాలంలో బంగారంతో పోల్చితే వెండి బుల్లిష్‌గా ఉండనుందని పేర్కొన్నారు. ప్రస్తుతం 52 వేల రూపాయల స్థాయిల్లో కదలాడుతున్న వెండి ధరలు 65 వేల రూపాయల నుంచి 70 వేలకు చేరుకోవచ్చని తెలిపారు. బంగారం దిగుమతులను కట్టడి చేయటానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు డిమాండ్‌ను ఎంతమాత్రం సత్ఫలితాలివ్వటం లేదని ఇందుకు



ఇ కాయిన్స్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభిస్తున్న కొఠారి

జనవరి-మార్చి త్రైమాసికంలో దిగుమతైన బంగారమే నిదర్శనమని కొఠారి అన్నారు. జనవరి-మార్చి త్రైమాసికంలో 200 టన్నులకు పైగా బంగారాన్ని భారత్ దిగుమతి చేసుకుంది.

## ఇ కాయిన్స్ ట్రేడింగ్..

ఎలక్ట్రానిక్స్ పద్ధతిలో తొలిసారిగా తక్కువ డినామినేషన్‌లో బంగారం ట్రేడింగ్ చేసేందుకు ఆర్‌ఎస్‌బిఎల్ ఇ - కాయిన్స్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించినట్లు కొఠారి తెలిపారు. 1,2,5,10,20 గ్రాముల బంగారం కొనుగోలు, విక్రయం వంటివి చేపట్టవచ్చని అన్నారు. అవసరమైతే స్పాట్ డెలివరీని కూడా చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. ఇది పూర్తిగా బి 2 బి మోడల్ అని ఆయన పేర్కొన్నారు. పర్సనల్ కంప్యూటర్లు, ల్యాప్‌టాప్, టాబ్లెట్స్ ద్వారా ఆర్‌ఎస్‌బిఎల్ టెర్మినల్‌లో క్లయింట్లు రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.